## క్లుప్తంగా

### వైవీయూలో ప్రీ రిపబ్లిక్ డే క్యాంపు ఎంపికలు



ప్రీ రిపబ్లిక్ డే ఎంపికల్లో పాల్గొన్న వలంటీర్లు

**వైవీయూ:** వైవీయూలో ప్రీ రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంపునకు ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఎంపికలు బుధవారం నిర్వహించారు. హైదరాబాద్ ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్ రామకృష్ణ, సంజయ్, వైవీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి పర్యవేక్షణలో ఎంపికలు సాగాయి. విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న కళాశాలలలో 121 యూనిట్లకు సంబంధించిన వలంటీర్లు పోటీపడ్డారు. ఇందులో ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయిని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. మహారాష్ట్రలో జరిగే ప్రీ వెస్ట్ జోన్ రిపబ్లిక్ డే క్యాంపునకు వలంటీర్లను పంపుతున్నామన్నారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మహారాష్ట్రలో ఎంపికైన వారు 2025వ సంవత్సరం జనవరి 26న ఢిల్లీలో జరిగే పెరేడ్‌లో పాల్గొనేందుకు అర్హత లభిస్తుందన్నారు.

### సూపర్ సిక్స్.. అమలు సూపర్ ఫ్లాప్

**కడప సెవెన్‌రోడ్స్ :** ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు రాష్ట్రంలో సూపర్ ఫ్లాప్‌గా మారాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి ధ్వజమెత్తారు. ఏపీసీసీ పిలుపు మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన థాలీ బజావో కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకపోతే ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకు లు అఫ్జల్‌ఖాన్, బండి జకరయ్య, సంఘ సేవకులు, సలావుద్దీన్, మహమ్మద్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### క్లిష్టమైన సర్జరీ విజయవంతం



ఓబులమ్మతో డాక్టర్ జహింగీర్‌బాష

**కడప రూరల్:** కడప నగరంలోని జేబీ ఆసుపత్రిలో క్లిష్టమైన సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక ఆ ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ జహింగీర్‌బాష వివరాలు తెలిపారు. ఓబులమ్మ అనే వృద్ధురాలుకు రెండు కాళ్లు వంకరగా పోవడం జరిగిందన్నారు. ఇందుకు మోకాలి మార్పిడి సర్జరీ చేయాల్సి వుంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఓబులమ్మ తమ ఆసుపత్రికి వచ్చారని పేర్కొన్నారు. రోబో ద్వారా రెండు కాళ్లకు క్లిష్టమైన సర్జరీని విజయవంతగా నిర్వహించామన్నారు. ఆ ఆసుపత్రి సీఈఓ డాక్టర్ జయ భారతి మాట్లాడుతూ రోబో ఆపరేషన్లను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

### పర్యాటకం ద్వారా శాంతి సాధనకు కృషి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పర్యాటకాభిమానులు

**కడప కల్చరల్ :** పర్యాటకం ద్వారా ఆర్థిక ఆదాయంతోపాటు శాంతి సాధనకు కృషి చేయాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య పిలుపునిచ్చారు. 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తు వేడుకల్లో భాగంగా బుధవారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల ఫొటోల ప్రదర్శనతో పాటు పోస్టర్లను విడుదల చేశారు. చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్, సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి, పర్యాటక అభిమానులు పాల్గొన్నారు.

### యాజమాన్య పద్ధతులను పాటించాలి



సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారి సురేష్

**కడప అగ్రికల్చర్:** వరిపంటను సాగు చేసే రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులను తప్పని సరిగా పాటించాలని కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఎరువుల్లో భాగంగా ప్రతి రైతు తప్పని సరిగా సేంద్రియ ఎరువులను కూడా వాడాలని తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం కడప మండలం పరిధిలోని పాలెంపల్లిలో రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. అనంతరం గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ పలు సూచనలు ఇచ్చారు. వ్యవసాయ విస్తరణ అధికారులు మెహరాజ్, పావని పాల్గొన్నారు.

**వర్షం వస్తే ఇక్కట్లే..**
వర్షం వచ్చిన ప్రతిసారి పలు కాలనీలలో ప్రజలు అగచాట్లు పడుతున్నారు. రోడ్లలో వర్షపు నీరు నిల్వ ఉండడంతో ప్రజలు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిలిచిన వర్షపు నీటిలో దోమలు వృద్ధి చెంది వ్యాధి కారకాలుగా మారుతున్నాయి. అధికారులు సమస్య పరిష్కరించాలి.
- మునెయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి, కడప





**అధికారులు స్పందించాలి**
ఎస్‌బీఐ కాలనీలో వర్షపు నీరు నిల్వ ఉంటోంది. వాన నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే నగరపాలక సంస్థ అధికారులు స్పందించి రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని తొలగించాలి.
- ఎస్. గౌస్ బాష, ఎస్‌బీఐ కాలనీ, కడప

వర్షం వస్తే కడప నగరంలోని పలు వీధుల్లో ప్రజలకు అగచాట్లు తప్పడం లేదు. మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో పలు కాలనీలలోని రోడ్లలో వర్షపు నీరు నిల్వ ఉంటోంది. వర్షపు నీటిని తొలగించాలని పలుమార్లు ప్రజలు నగరపాలక సంస్థ అధికారులకు విన్నవించినా వారు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



కడప నగరంలోని అప్సర ప్రాంతంలో జలమయమైన ఇల్లు



వీధిలో నిలిచిన వర్షపు నీరు

# రోడ్లపై నీరు.. సమస్య తీరేదెన్నడు..?

**కడప ఎడ్యుకేషన్, కడప వైఎస్‌ఆర్ సర్కిల్:** కడప నగరంలో బుధవారం తెల్లవారుజామున వర్షం దంచికొట్టింది. దాదాపు గంటకు పైగా భారీ వర్షం కురవడంతో 90.2 ఎంఎం వర్షపాతం నమోదయింది. దీనికి తోడు అంతకుముందు సోమవారం కూడా 38.2 ఎంఎం వర్షం కురవగా మంగళవారం 43.2 ఎంఎం కురిసింది. దీంతోపాటు బుధవారం తెల్లవారుజామున కూడా భారీ వర్షం కురవడంతో నగరంలోని పలు డ్రైనేజీ కాలువల నీరు రోడ్లపై పొంగి పొర్లాయి. నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో వర్షపునీరు నిలవడంతో చెరువును తలపించింది. అలాగే ఆర్టీసీ బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లేదారిలో వర్షపు నీరంతా రోడ్లపై ప్రవహించింది. దీంతో జనాలు చాలా ఇబ్బందులు పడ్డారు. చిన్నచౌక్, అప్సర ప్రాంతంలో పలు చోట్ల వర్షపునీరు ఇళ్లలోకి వెళ్లడంతో జనం ఇక్కట్లు పడ్డారు. వర్షపునీరు వెళ్లేందుకు వీలు లేని చోట్ల నగరపాలక సంస్థ అధికారులు నీటిని వాక్యూమ్ వాహనంతో తొలగించారు.



అపూర్వ ఫంక్షన్ హాల్ సమీప ప్రాంతంలో..



ఎస్‌బీఐ కాలనీ ప్రధాన రహదారిలో..

## లోతట్టు ప్రాంతాలు జలమయం

**కడప వైఎస్‌ఆర్ సర్కిల్:** ఎస్‌బీఐ కాలనీలో రోడ్లు జలమయం అయ్యాయని, జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం 48 వ డివిజన్ పరిధిలోని స్టేట్ బ్యాంక్ కాలనీలో వరద నీటికి ముంపునకు గురైన ప్రాంతాలను సీపీఐ నాయకులు పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. స్టేట్ బ్యాంక్ కాలనీ చుట్టూ డ్రైనేజీ కాలువల ఆక్రమణలకు గురి కావడంతో చిన్నపాటి వర్షానికే కాలనీ వరద ముంపునకు గురవుతోందన్నారు. ఏళ్ల తరబడి ఉన్న ఈ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ, సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా, నాయకులు సావంత్ సుధాకర్, మల్లికార్జున, మునెయ్య, బాబు పాల్గొన్నారు.




ఎస్‌బీఐ కాలనీలో పర్యటిస్తున్న సీపీఐ నాయకులు



రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో..

### చిత్తూరు ఐసీడీఎస్ పీడీగా హైమావతి

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** జిల్లాలోని ప్రొద్దుటూరు సీడీపీఓగా పనిచేస్తున్న కె.హైమావతిని చిత్తూరు ఐసీడీఎస్ పీడీగా బదిలీ చేస్తూ ఐసీడీఎస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కుప్పం అడిషనల్ పీడీగా నియమించి పీడీగా పూర్తి బాధ్యతలను అప్పగించారు.

### అంత్యక్రియలు



**కడప అర్బన్:** కడప నగరంలోని నబీకోటలో నివాసం వుంటున్న గంగిశెట్టి రాజమ్మ కుమారుడు గంగిశెట్టి వెంకటసుబ్బయ్య (29) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. అంత్యక్రియలు నిర్వహించేవారు ఎవరూ లేకపోవడంతో రాజమ్మ శ్రీ కాశీవిశ్వనాథ సేవాసమితి వారిని సంప్రదించారు. దీంతో వారు ముందుకు వచ్చి మానవత్వంతో హిందూ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కాశీవిశ్వనాథ సేవాసమితి సభ్యులు రెడ్డి లక్ష్మణ్, పుట్టా పురుషోత్తం, రాఘవేంద్ర, దామోదర్, రాజశేఖర్ రెడ్డి, ఎలక్ట్రీషియన్ మధు, టైలర్ రవి పాల్గొన్నారు.

### మార్కుల నమోదు సరళీకృతం చేయాలి

**కడప ఎడ్యుకేషన్:** ప్రభుత్వ పాఠశాలల్లో సెల్ఫ్ అసెస్మెంట్ మార్కులను స్కూల్ అటెండెన్స్ యాప్ ఆన్‌లైన్ నమోదులో తలెత్తే అసౌకర్యాలను సరిచేసి సరళీకృతం చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సి వి ప్రసాద్, కడప ,అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వర చంద్ర ,అలీఖాన్, ఉమాకాంత్ కోరారు. సబ్జెక్ట్ ఉపాధ్యాయుల లాగిన్‌లో స్వీయ బోధన తరగతుల విద్యార్థులందరి జాబితా కనబడేటట్లు చూడాలని కోరారు. పొరపాట్లను సరి చేయుటకు ప్రతి అంశానికి ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్తగా చేరిన విద్యార్థుల పేర్లన్నీ అంతర్జాలంలో కనిపించేటట్లు చేయాలన్నారు.

### సీబీఎస్ఈ నిర్ణయాన్ని ఉపసహరించుకోవాలి

**కడప వైఎస్‌ఆర్ సర్కిల్:** ఇంగ్లిష్ లేదా హిందీలో మాత్రమే ప్రశ్నా పత్రాలను అందించాలన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్ణయం ఉర్దూ మీడియం పాఠశాలల విద్యార్థులను ఇబ్బందుల్లోకి నెట్టేసిందని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాష పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైనారిటీ వర్గాల రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు జాతీయ మైనారిటీ కమిషన్, సంబంధిత అధికారులు జోక్యం చేసుకోవాలన్నారు. సీబీఎస్ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సయ్యద్ షా వలి పాల్గొన్నారు.

## సమతుల్య ఆహారంతోనే ఆరోగ్యం

**వైవీయూ:** సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా జీవన ప్రమాణ రేటును పెంచుకోవచ్చని వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం వైవీయూ ఫుడ్ టెక్నాలజీ శాఖ, రీపర్పస్ యూజ్డ్ కుకింగ్ ఆయిల్ స్టార్ గ్లోబల్ ఏజెన్సీస్ సంయుక్త ఆధ్వర్యంలో 'వంట నూనెను తిరిగి వాడటం మానుకోండి- మీ తలరాతను కాపాడుకోండి'(అవాయిడ్ రీ యూజింగ్ కుకింగ్ ఆయిల్) పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వినియోగించిన ఆయిల్‌నే మళ్లీ మళ్లీ వినియోగిస్తూ చేసే ఆహార పదార్థాలు అనేక రకాల అనారోగ్య సమస్యలను తెస్తాయని వివరించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ మాట్లాడుతూ పాతకాలపు ఆహారపు అలవాట్లను కొనసాగించాలన్నారు. ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె. చిన్నపరెడ్డి మాట్లాడుతూ మన ఆరోగ్యం, మనం తినే ఆహారంలోనే ఉందన్నారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జి. ప్రభాకర్ రావు మాట్లాడుతూ జంక్ ఫుడ్స్ కి దూరంగా ఉండాలన్నారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు ఎం. హరిత, షంషీర్ ఖాన్ మాట్లాడుతూ మంచి ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉంచవచ్చన్నారు. స్టార్ గ్లోబల్ ఏజెన్సీస్ సీఈఓ ఎస్. బాలాజీ, కడప హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.ఎం.రషీద్ ఖాన్ మాట్లాడారు. అనంతరం సదస్సు కన్వీనర్లు విశ్వవిద్యాలయ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డా. వి. రామకృష్ణ , ఎన్విరాన్మెంట్ సైన్స్ సహ ఆచార్యులు డా. టి. చంద్రశేఖర్, డాక్టర్ శ్రీధర్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య కృష్ణారెడ్డి

## కార్లు కుదువ పెట్టి జల్సా చేస్తారు

**కడప అర్బన్:** జల్సాలకు, దురలవాట్లకు అలవాటు పడిన ఇద్దరు యువకులు కార్లు అద్దెకు తీసుకుంటారు. ఆ తరువాత ఎంచక్కా వాటిని దూరప్రాంతాలకు తీసుకుని వెళ్లి కుదువ పెడతారు. ఆ వచ్చిన డబ్బులతో జల్సా చేస్తుంటారు. ఇలాంటి వారిపై బాధితులు బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని కడప తాలూకా సీఐ జి. వెంకటేశ్వర్లు తెలియజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కడప నగరం నబీకోటకు చెందిన శశిధర్‌రెడ్డి, జిలాన్ బాషా అనే ఇద్దరు జల్సాలకు అలవాటు పడ్డారు. ఈ క్రమంలో కార్ల యజమానులతో తమకు జిల్లా అధికారులు బాగా పరిచయమని నమ్మబలికిస్తారు. నెలరోజుల పాటు ఖచ్చితంగా బాడుగ ఇచ్చినట్లుగా రూ. 30 వేలు చెల్లిస్తారు. ఆ తరువాత మాయమాటలు చెప్పి మరుసటి నెల నుంచే వాహనాలను కుదువకు పెట్టేస్తారు. ఇటీవల కడప నగరం నబీకోటకు చెందిన వీరేంద్ర అనే యువకుడికి సంబంధించిన మూడు కార్లను తీసుకున్న పై ఇద్దరు ఒక నెలరోజుల పాటు బాడుగ ఇచ్చారు. ఆ తరువాత అద్దె ఇవ్వకుండా మాటలు చెబుతూ దాటవేస్తున్నారు. ఈ క్రమంలో తీవ్ర ఇబ్బందులు పడిన వాహనదారులు పోలీసులను ఆశ్రయించారు. పై ఇద్దరిపై వీరేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రస్తుతానికి ఇలా ఫిర్యాదు చేసిన బాధితుల సంఖ్య 20 మంది ఉన్నారని, బాధితుల సంఖ్య ఇంకా పెరగవచ్చని సమాచారం.

## ఆధునికతను అందిపుచ్చుకోవాలి



ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం గురించి నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఫోటోగ్రాఫర్లు

**కడప కల్చరల్ :** ఫోటోగ్రఫీ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నప్పుడే వేగవంతమైన ఈ వ్యాపార మార్పులలో ఆధిపత్యం సాధించగలమని గో డోగ్స్ కంపెనీ ప్రతినిధి అఖిల్ సింగమ్ అన్నారు. బుధవారం కడప నగరంలోని శ్రీ రాజరాజేశ్వరీ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ ఫోటో అండ్ వీడియో వెల్ఫేర్ అసోసియేషన్, కడప ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడిగా ఫోటోగ్రఫీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం గురించి సమీక్ష నిర్వహించారు. గో డోగ్స్ కంపెనీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో వివాహంలో ఫోటోలు కళాత్మకంగా, ఆకర్షణీయంగా తీయడం గురించి వివరించారు. ఏపీపీవీడబ్ల్యు గౌరవాధ్యక్షులు కె.చంద్రారెడ్డి, అధ్యక్షులు సి.శివశంకర్‌రెడ్డి, కార్యదర్శి వి.శివరామకృష్ణ, ఉపాధ్యక్షులు జిలానీబాష, కోశాధికారి వీరబ్రహ్మం, సహ కార్యదర్శి ప్రభుదాస్‌లు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సదస్సులో గో డోగ్స్ డిస్ట్రిబ్యూటర్ ఆనంద్, టెక్ పర్సన్ రాహుల్ కూడా ఫోటోగ్రఫీ గురించి ప్రాక్టికల్‌గా వివరించారు.

### బైక్‌తో విన్యాసాలు చేస్తే చర్యలు

**కడప అర్బన్:** కడప రిమ్స్ పీఎస్ రహదారిపై బైక్‌తో విన్యాసాలు చేసిన యువకులను పిలిపించి రిమ్స్ ఎస్ఐ జయరాములు హెచ్చరించారు. ఇటీవల కలెక్టరేట్ నుంచి రిమ్స్‌కు వెళ్లే దారిలో యువకులు బైకులలో అతివేగంతో పాటు విన్యాసాలు చేస్తూ వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. మీడియోలు పరిశీలించి సీజ్ చేశారు. ఆ యువకులను గుర్తించి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. బైక్ విన్యాసాలు చేస్తే చర్యలు తప్పవన్నారు.

### కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కార్మిక పరిషత్ జోనల్ కార్యదర్శి ఎం.పురుషోత్తం, రీజినల్ ప్రెసిడెంట్ ఏపీఎస్ రెడ్డిలు కోరారు. బుధవారం కడపకు వచ్చిన రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని వారు కలిశారు. అనంతరం కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులరెడ్డిలను కలిసి సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, రాజేంద్రారెడ్డి, తిమ్మారెడ్డి, శివశంకర్, మల్లికార్జున, ఎస్వీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దేవదాయశాఖ ఏసీకి సన్మానం

**కడప కల్చరల్ :** జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జున ప్రసాద్‌ను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు బబుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత ఏటూరి రామచంద్రా రెడ్డి, పట్టెం సుబ్బారెడ్డి, మహా ఎమ్మార్పీఎస్ నాయకులు పచ్చారం బాలసుబ్బయ్య, పొన్నోలు సుబ్బరాయుడు, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారామ్, ఉపాధ్యక్షులు గొడుగునూరు మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ ప్రజెంటేషన్‌తో న్యాక్ గ్రేడ్

**వైవీయూ:** అకడమిక్, నాన్ అకడమిక్ ఫైల్స్‌ను చక్కగా రూపొందించుకోవడంతో పాటు వాటిని ప్రజెంట్ చేసే విధానాన్ని అనుసరించి న్యాక్ లో ఉత్తమ గ్రేడ్ సాధించవచ్చని అనంతపురం జిల్లా ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో న్యాక్ గ్రేడింగ్ సన్నాహక ప్రక్రియపై వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేమల సలీంబాషా మాట్లాడుతూ ఉరవకొండ కళాశాల ప్రిన్సిపాల్ ఇచ్చిన సూచనలు ఎంతో విలువైనవని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా, సమిష్టి కృషితో కళాశాలకు ఉత్తమ గ్రేడింగ్ సాధించేందుకు కృషిచేయాలని కోరారు.

**చరిత్రపై అతిథి ఉపన్యాసం..**

కళాశాలకు విచ్చేసిన కర్నూలు సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.ఎస్. కుమార్, చరిత్ర అధ్యాపకులు డా. బి.ఆర్. ప్రసాద్‌రెడ్డిలు చరిత్రశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం టూరిజం గురించి వివరించారు. కార్యక్రమంలో అర్థశాస్త్రశాఖ విభాగాధిపతి జి. విజయలక్ష్మి దేవి, శ్రీనివాసులరెడ్డి, షాజీరాబేగం, అరుణ పాల్గొన్నారు.

### జాతీయ సమైక్యత శిబిరంలో వలంటీర్లు

**వైవీయూ:** కర్ణాటక జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఈనెల 17 నుండి 23 వరకు బెంగళూరు నగరం గాంధీ భవన్‌లో నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరం ( నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్) నిర్వహించారు. తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాతోపాటు మహారాష్ట్ర ఎన్ఎస్ఎస్ యూనిట్లు హాజరవగా ఆంధ్రప్రదేశ్ తరుపున వైవీయూ పరిధిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోవిందరెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులు మీనాక్షి, నవ్య, నోహిత, నస్రీన్, రోజా, నంది వర్ధన్, మహేంద్ర, క్రికాంత్, ఇందు బాబు, హరీష్ కుమార్ హాజరయ్యారు. వలంటీర్లు ప్రాంతీయ ప్రాముఖ్యత గల నృత్యాలు, పౌరాణిక ఘట్టాలు, ఏక పాత్రాభినయాలు ప్రదర్శించారు.

### అన్నదాత సుఖీభవ అమలు చేయాలి



డీఆర్వోకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

**కడప సెవెన్‌రోడ్స్ :** రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని తక్షణమే అమలు చేసి రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలు ఖాతాల్లో జమచేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, రైతు స్వరాజ్యవేదిక జిల్లా కన్వీనర్ శివారెడ్డి కోరారు. బుధవారం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. 2023 ఖరీఫ్ పంటల బీమా ఇవ్వాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే జీఓ నెంబరు 22ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. భూ యజమానుల సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు దారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తున్నారని, యూరియా, డీఏపీ ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### పుస్తకాల వితరణ

**కడప ఎడ్యుకేషన్:** కడప నగరంలోని ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థులకు రైసడ్ లైన్స్ ఫౌండేషన్(ఆర్ఎల్ఎఫ్) ఢిల్లీ ఐఐటి నుంచి పులకిత్ అనే రీసోర్స్ పర్సన్ తెలుగు, ఇంగ్లీషు, సైన్సు, గణితం, సోషియల్ సబ్జెక్టులకు సంబంధించిన ట్రాక్‌లెట్ బుక్స్‌ను వితరణగా అందించారు. సంబంధిత పుస్తకాలపై ఆయన పిల్లలకు, ఉపాధ్యాయులకు తర్ఫీదు కూడా ఇచ్చారు. ఈ సందర్భంగా పులకిత్ మాట్లాడుతూ ఈ పుస్తకాలు అంధ విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. అంధ విద్యార్థులకు పుస్తకాలను వితరణ చేసినందుకు పులకిత్‌ను అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేపరాల ఎబినైజర్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాలకు చెందిన రాజ, నరసింహులు, కుమార్, మురళీ, సరస్వతి, రమణ, నవీన్, కరీముల్లా, శ్రీనివాసుల ఈ పుస్తకాలపై ట్రైనింగ్ పొందారు.

### పరిశుభ్రతకు ప్రాధాన్యం



ప్రతిజ్ఞ చేస్తున్న మను పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

**కడప ఎడ్యుకేషన్:** కడప రిమ్స్ వద్ద ఉన్న మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మీర్జా వీలయత్ అలి బైగ్ మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ద్వారా పర్యావరణం పట్ల అవగాహనను పెంపొందిస్తున్నామన్నారు. క్యాంపస్‌లో పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడంలో వారానికి రెండు గంటలు స్వచ్ఛంద కార్యక్రమాలకు కేటాయిస్తామని విద్యార్థులు సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ హాకీముద్దీన్, మొహమ్మద్ సికందర్ హుస్సేన్, మహమ్మద్ ఖాజా మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### వరద బాధితులకు చేయూత

**కడప ఎడ్యుకేషన్:** విజయవాడ వరద బాధితుల సహాయార్థం మేము సైతం అంటూ బిమతం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు తమ ఉపాధ్యాయుల సహకారంతో ముందుకు వచ్చారు. తమ వంతుగా సేకరించిన రూ.10,120 బుధవారం జేసీ అదితి సింగ్‌ను కడప కలెక్టరేట్‌లో కలిసి చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మనాభమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బరామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.